సాక్షి మంచిర్యాల

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



ఆశలు.. అడియాశలు

జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల ఆశలు అడియాశలు అవుతున్నాయి. ధాన్యం, చేలలో పత్తి తడిసి నష్టపోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. 8లో▸



తీరం వెంట నిఘా

వేమనపల్లి: మావోయిస్టు బంద్ నేపథ్యంలో నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రాణహిత నదీ తీరం వెంట నిఘా ఏర్పాటు చేశారు. ఫెర్రీ పాయింట్ వద్ద తనిఖీ నిర్వహించారు. నాగారాం, మంగెనపల్లి, నీల్వాయి, మల్లంపేటలో వాహనాల తనిఖీ చేపట్టారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0 /19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వినతులు పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, పరిహారం, తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఆయా శాఖలకు అందిన అర్జీలు సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని తెలిపారు. మందమర్రి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా నిధులు మంజూరైనా పూర్తి స్థాయిలో పనులు కాలేదని అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షుడు రాజేష్ వినతిపత్రం అందజేశారు.

పట్టాపాసు పుస్తకం ఇప్పించాలి



మేము 50ఏళ్లుగా హాజీపూర్ మండలం నంనూర్‌లో ఉంటూ సర్వే 206లో 8 గుంటలు, సర్వే 375లో 2.20 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాం. ఈ భూమి ఇంత వరకు పట్టాపాసు పుస్తకం రాలేదు. ఏళ్ల తరబడి కాస్తు చేసుకుంటూ బతుకుతున్నాం. అధికారులు పట్టాపాసుపుస్తకం ఇప్పించాలి.

– మ్యాతెల మల్లమ్మ, గ్రామం: నంనూర్, మం: హాజీపూర్

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష కార్యదర్శులు చక్రపాణి, రాజావేణు

బెల్లంపల్లి: టీఎస్ యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బెల్లంపల్లి తాపీ సంఘ భవనంలో జిల్లా ఐదో మహాసభలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.చక్రపాణి, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, లావణ్య, కోశాధికారిగా కిరణ్, ప్రధాన కార్యదర్శిగా జి.రాజావేణులను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా నర్సయ్య, చంద్రమౌళి, బాపు, బబిత, దేవదాస్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, సుమనచైతన్య ఎన్నికయ్యారు. ఆడిట్‌కమిటీ కన్వీనర్‌గా రవికుమార్, సభ్యుడిగా సంపత్‌ను ఎంపిక చేశారు.

గ్రూప్–2 పరీక్ష సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ నెల 15, 16వ తేదీల్లో గ్రూప్–2 పరీక్ష సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 14,951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించామని, అభ్యర్థులను ఉదయం 8.30 గంటలు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు.

క్రీడారంగ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

మంచిర్యాలఅగ్రికల్చర్: క్రీడారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఇందులో భాగంగా సీఎం కప్–2024 పోటీలు నిర్వహిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల, మున్సిపాలిటీ స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 16 నుంచి 21వరకు జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. అధికారులు సమన్వయంతో క్రీడా పోటీలు నిర్వహించాలని తెలిపారు.



అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న వాంకిడి చెక్‌పోస్టు

ఆగని దారి దోపిడీ!

- వాంకిడి చెక్‌పోస్టు వద్ద అక్రమ వసూళ్లు
- 'ఆర్టీఏ' తనిఖీల మాటున రూ.లక్షల్లో ఆర్జన
- ప్రైవేటు సిబ్బందితోనే యథేచ్ఛగా దందా
- అంతర్రాష్ట్ర సరిహద్దు కేంద్రంగా అవినీతి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆర్టీఏ చెక్‌పోస్టులో అక్రమ వసూళ్ల పర్వం ఆగడం లేదు. ఈ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీల సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. వ్యవస్థీకృతంగా మారిన ఈ దారి దోపిడీతో రోజుకు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టు కేంద్రంగా అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పోస్టింగ్‌కు పోటాపోటీ

ఒక రోజు డ్యూటీ చేస్తే రూ.లక్షలు ఇంటికి తీసుకువెళ్లే చెక్‌పోస్టు విధుల కోసం అధికారులు, సిబ్బంది అమితాసక్తి చూపిస్తారు. ప్రస్తుతం ఏడుగురు రవాణా శాఖ అధికారులు ఉన్నారు. నలుగురు ఎంవీఐ(మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) కాగా, మరో ముగ్గురు ఏఎంవీఐ(అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) ఉన్నారు. గతంలో ఆన్‌డ్యూటీ(ఓడీ)లు, రెగ్యులర్ విధులతో చెక్‌పోస్టుల్లోనూ పని చేశారు. ప్రభుత్వం ఓడీలు రద్దు చేసింది. దీంతో ఏడుగురు అధికారులే రోజుకు ఒకరు చొప్పున విధుల్లో ఉంటున్నారు. వీరికి ఓ కానిస్టేబుల్, ఆఫీస్ సబార్డినేట్, మరో పది నుంచి 20మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పని చేస్తున్నారు. అధికారులు వాహనాల అనుమతి, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్, పన్నులు, ఓవర్ లోడ్ తదితరవన్నీ చెక్ చేసి పంపించాలి. ఏవైనా లేకుంటే నిబంధనల మేరకు జరిమానాలు వేయాలి. కానీ తనిఖీ చేశాక పర్మిట్ ఇచ్చేందుకు వాహన డ్రైవర్లను బట్టి వసూలు చేస్తున్నారు.

రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు

హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి మంచిర్యాల మీదుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి దాటి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు జాతీయ రహదారి 363పై నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాగ్‌పూర్, విజయవాడ, తెలంగాణతోపాటు ఏపీ, చైన్నయ్ వరకు వెళ్తుంటాయి. ఒక్కో బండి నుంచి రూ.500 నుంచి రూ.600వరకు వసూలు చేస్తున్నారు. రోజూ వందలాది వాహనదారుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న సొమ్ము రూ.2లక్షల నుంచి రూ.3లక్షల దాకా ఉంటోంది. నెలకు అరకోటి పైనే. రద్దీ వేళల్లో ఇంకా అదనంగానే ఉంటోంది.

డబ్బాలో డబ్బులు వేయిస్తూ..

వాహనదారులను ప్రైవేట సిబ్బంది చేతులు, కర్రలు, రాత్రి వేళ స్టిక్కర్లు ఉన్న కర్రలను రోడ్డుపై చూపుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాలు నిలిపి వేస్తుంటారు. డ్యూటీలో ఉన్న అధికారి పత్రాల పరిశీలన చేస్తుంటారు. అక్కడితో ఆగకుండా చెక్‌పోస్టు లోపల ఓ డబ్బాను ఏర్పాటు చేశారు. ఎవరి చేతికి ఇవ్వకుండా అందులో డబ్బులు వేయిస్తుంటారు. ఆ డబ్బాను గమనిస్తూ పోగైన డబ్బులను తీసుకుంటూ ఖాళీ చేస్తుంటారు. ఈ డబ్బు నుంచి రోజువారీగా ప్రైవేటు వ్యక్తుల కూలి, భోజనాలు, ఖర్చులు పోను మిగిలినవి పంచేసుకుంటున్నారు. వాహనదారుల నుంచి కూరగాయలు, గుడ్లు, బాయిలర్ కోళ్లు, పండ్లు తదితరవన్నీ తీసుకుంటున్నారు.

అడిగినంత ఇస్తున్నం



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చెన్నయ్ వెళ్తున్న. ప్రతీసారి చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ఇబ్బందులకు గురి చేస్తారనే భయంతో అడిగినంత ఇస్తున్నం.

– మనోజ్ గుప్తా, డ్రైవర్

రూ.500 తీసుకుంటున్నారు



నెలకు నాలుగైదు సార్లు మధ్యప్రదేశ్ నుంచి విజయవాడకు ఈ చెక్‌పోస్టు గుండా వెళ్తుంటాం. ప్రతీసారి రూ.500తీసుకుంటున్నారు. డబ్బులు ఎందుకని అడిగితే ఏం చెప్పరు.

– వెంకటేశం, డ్రైవర్

అందరికీ మామూళ్లే..

వాంకిడి చెక్‌పోస్టులో యథేచ్ఛగా దారిదోపిడీ సాగుతున్నా ఎవరూ అడ్డు చెప్పరు. ఇందుకు అధికారులు పెద్దయెత్తున పంపకాలు చేస్తుంటారు. ఇందులో అన్ని రంగాల వారు ఉన్నారు. ప్రజాప్రతినిధుల నుంచి మొదలు ఎన్నికల్లో ఓడిపోయిన నాయకుల దాకా డబ్బులు అందుతుంటాయి. జిల్లా, ఉమ్మడి జిల్లాలో ఆ వ్యక్తిని బట్టి కనీసం రూ.5వేల నుంచి లక్ష దాకా మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అందరూ కళ్లు మూసుకున్నట్లుగా ఉంటున్నారు. ఈ అక్రమ దందాపై ఏసీబీ, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

బోదకాలు వ్యాధిపై సర్వే

- జిల్లాలోని ఆరు మండలాల్లో 5,400 నమూనాల సేకరణ
- నేడు, రేపు సర్వే చేయనున్న వైద్యులు, సిబ్బంది
- జిల్లాలో 892 మంది వ్యాధిగ్రస్తులు
- పింఛన్ పొందుతున్న వారు 276 మంది



బోదకాలుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో బోదకాలు(ఫైలేరియా)పై సర్వేకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆరు మండలాలను ఎంపిక చేసింది. ఈ నెల 10, 11వ తేదీల్లో అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించనుంది. వ్యాధి తీవ్రతను గుర్తించి వెంటనే చికిత్స అందించేలా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో గత ఏడాది 3,556మంది నుంచి నమూనాలు సేకరించగా.. ఒకరికి వ్యాధి నిర్ధారణ అయింది. ఈ ఏడాది 5,400 నమూనాల సేకరణకు 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 108 బృందాలను ఏర్పాటు చేశారు. 18 మంది వైద్యాధికారులు, ఆరుగురు సబ్ యూనిట్, సీహెచ్‌వోలు, 39 మంది హెల్త్ సూపర్‌వైజర్లు, 186 మంది ఆశా వర్కర్లు, 30 మంది హెల్త్ అసిస్టెంట్లు, 18 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 61మంది ఆశా కార్యకర్తలను నియమించారు. మంగళవారం రాత్రి హాజీపూర్ మండలంలో శాంపిళ్ల సేకరణను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ప్రారంభిస్తారు. జన్నారం, మందమర్రి, జైపూర్, భీమిని, బెల్లంపల్లి మండలాల్లోని హైరిస్క్ గ్రామాల్లో ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది బుధవారం రాత్రిలోపు రక్త నమూనాల సేకరణ పూర్తి చేస్తారు. వ్యాధి ఉన్నట్లు గుర్తించిన వారికి 12 రోజుల చికిత్స అందిస్తారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా బోదకాలు వ్యాధిగ్రస్తులు 892 మంది ఉండగా, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న 276 మంది పింఛన్ పొందుతున్నారు. వ్యాధి సోకిన వారు వైద్య సిబ్బందికి సహకరించడంతోపాటు సమీపంలోని ప్రజలు వారి రక్త నమూనాల సేకరణకు సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ కోరారు.

'సమగ్ర' ఉద్యోగుల సమ్మెబాట



కలెక్టరేట్ ఎదుట సోనియా, రేవంత్‌రెడ్డి చిత్రపటాలతో నిరసన దీక్షలో ఉద్యోగులు

- మూడు రోజులపాటు రిలే దీక్షలు
- ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- నేటి నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం

మంచిర్యాలఅర్బన్/కెరమెరి(ఆసిఫాబాద్): విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్‌చేస్తూ ఆందోళన బాటపట్టారు. ఈ నెల 6 నుంచి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఎమ్మార్సీ, సీఆర్‌సీ స్థాయిల్లో పనులకు ఆటంకం ఏర్పడనుంది. అలాగే కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌ల ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొననున్నారు.

క్రమబద్ధీకరణ కోసం..

సమగ్ర శిక్షా పరిధిలో క్లస్టర్ స్థాయి, జిల్లా స్థాయితోపాటు కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19వేల మంది కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2017 మంది సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. పదేళ్లకు పైగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధస్థాయిల్లో వినతులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడంతో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు రిలే దీక్షలు చేపట్టారు.

సేవలకు ఆటంకం

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నుంచి సమ్మె చేపడుతుండటంతో విద్యాశాఖలో పలు సేవలు నిలిచిపోనున్నాయి. డీపీవో స్టాఫ్, అకౌంటెంట్స్, ఏఎస్‌ఎం, సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ, స్పెషల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీ, ఎంఐఎస్‌సీసీవో, పార్ట్‌టైం టీచర్లుగా వీరు విధులు నిర్వహిస్తున్నారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్, భవిత కేంద్రాల్లో బోధన నిలిచి విద్యార్థుల చదువుపై ప్రభావం పడనుంది. డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, వృత్తి విద్యా ఇన్‌స్ట్రక్టర్లు విధులకు దూరంగా ఉండనుండటంతో ఆన్‌లైన్ పనులు నిలిచిపోనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే సమ్మె నోటీసులు అందించారు.

ఉద్యోగుల వివరాలు

జిల్లా	ఉద్యోగులు
ఆదిలాబాద్	607
మంచిర్యాల	513
కుమురంభీం	473
నిర్మల్	424

సమాన పనికి సమాన వేతనం..

సమగ్రశిక్షాలో ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలి. సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. మా డిమాండ్లను నెరవేర్చే వరకు ఉద్యమిస్తాం.

– ఏ.సుమలత, టీఎస్‌ఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తాం. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెలోకి వెళ్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.

– రాజన్న, టీఎస్‌ఎస్‌యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కొనసాగిన దీక్షలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట డిమాండ్ల పరిష్కారానికి సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే నిరసన దీక్షలు సోమవారం కొనసాగాయి. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ చిత్రపటాలను ప్రదర్శిస్తూ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌యుఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎ.సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుమన, జిల్లాబాధ్యులు కవిత, ఫణిబాల, కనకలక్ష్మీ, మూర్తి, రాకేష్, శ్రీధర్, ముఖిత్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం

తెలంగాణ సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం నిరసనదీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కోశాధికారి మల్లన్న, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దు దాటిన పులి

- లేగదూడ కళేబరం లభ్యం
- పరిశీలించిన అధికారులు



లేగదూడ కళేబరం వద్ద అధికారులు

వేమనపల్లి: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సుంపుటం అటవీ ప్రాంతంలో గత శనివారం పశువుల మందపై దాడి చేసిన పులి అదే రోజు జిల్లా సరిహద్దు అడవులను దాటి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన అటవీ రేంజ్ వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. కుబిడె హన్మయ్య ఆవుపై దాడి చేయగా అది గాయాలతో తప్పించుకుని ఇల్లు చేరింది. మరో రెండు ఆవులకు స్వల్ప గాయాలు కాగా అవీ తప్పించుకున్నాయి. గ్రామానికి చెందిన కొండగొర్ల రాజన్న ఆవు కూడా తప్పించుకుని ఇంటికి రాగా దాని లేగదూడ ఆచూకీ మూడు రోజులకు లభ్యమైంది. దాడికి పాల్పడిన పాలపారక దారి సమీపంలో కళేబరం పడి ఉంది. ఒడ్డుగూడం సెక్షన్ అధికారి బేగ్, కొత్తపల్లి ఎఫ్‌బీఓ సఫియాబేగం, ఇటు కోర్స్ ఇన్‌చార్జి సాయి, బేస్ క్యాంపు సిబ్బంది అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించగా కళేబరం జాడ దొరికింది. దాడి చేసిన రోజు లేగదూడ కళేబరాన్ని కొంత దూరం లాక్కెళ్లింది. పశువులు, మేకల కాపరులు పెద్దయెత్తున అరవడం, గ్రామస్తులు, అటవీ అధికారులు ఘటన స్థలానికి వెళ్లడంతో అలజడి వాతావరణం మధ్య అక్కడి నుంచి పులి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అడవుల వైపు వెళ్లిపోయినట్లు గ్రామస్తులు, అటవీ అధికారులు తెలిపారు. రామలక్ష్మణుల గుట్ట, జెండా గుట్ట వరకు పులి పాదముద్రలు కనిపించాయి. రెబ్బెన సెక్షన్ అధికారి సద్దాం ఆధ్వర్యంలో సోమవారం సుంపుటం అడవుల్లోకి వచ్చి ఇక్కడి అటవీ అధికారులతో కలిసి పులిపై పర్యవేక్షణ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. లేగదూడను చంపిన ప్రాంతానికి పశువైద్యాధికారి సుప్రియారెడ్డి వెళ్లి పంచనామా నిర్వహించారు. మెడ వద్ద గాయాలు ఉండగా పులి దాడిలో మృతిచెందినట్లు నిర్ధారించారు.

రాంపూర్‌లో వదంతులు



రాంపూర్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

భీమిని: మండలంలోని రాంపూర్ గ్రామ శివారు ప్రాజెక్ట్ వద్దకు పులి వచ్చిందంటూ వదంతులు వినిపించాయి. చేన్లలో పత్తితీతకు రాజస్థాన్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూలీలు వలస వచ్చారు. మూడు రోజులుగా అకాల వర్షంతో పత్తి సేకరణకు వెళ్లకుండా స్థానిక గుడారాల్లో ఉంటున్నారు. ఆదివారం కొందరు వంట చెరుకు కోసం వెళ్లగా రాంపూర్ ప్రాజెక్ట్ దగ్గరలో పెద్దగా గాండ్రింపు శబ్దం వినిపించడంతో భయాందోళనకు గురై పరుగెత్తుకొచ్చి నట్లు తెలిపారు. తాండూర్ ఎఫ్ఎస్‌ఓ సువర్ణ సిబ్బందితో వెళ్లి పరిశీలించగా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. కాగా, ఈ నెల 6న చెన్నాపూర్ గ్రామ శివారులోనూ రైతులకు పులి కనిపించిందన్న ప్రచారం జరిగింది. దీంతో మండల ప్రజలు చేన్లకు వెళ్లేందుకు జంకుతున్నారు.

'పాలనలో కాంగ్రెస్ వైఫల్యం'



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ యువత, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందని బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీజేపీ పోరాటాలు ఆగవని, నాలుగు రోజుల క్రితం బైక్ ర్యాలీకి అనుమతి కోరుతూ ఏసీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసినా ఇవ్వలేదని అన్నారు. కలెక్టరేట్ వద్ద పోలీసులు స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో అడ్డుకున్నారని, అయినా ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. సోనియాగాంధీని రేవంత్‌రెడ్డి బలిదేవత అని అన్నారని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఏవిధంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు 2లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, రూ.5 లక్షల విద్యాభరోసా అందించే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజనీశ్‌జైన్, ఎనగందుల కృష్ణమూర్తి, బొలిశెట్టి అశ్విన్, గుండ ప్రభాకర్, మాధవరపు వెంకటరమణరావు, జోగుల శ్రీదేవి, బింగి ప్రవీణ్, సత్రం రమేశ్ పాల్గొన్నారు.

రక్షణ అందరి బాధ్యత

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ
- రక్షణ పక్షోత్సవాలు ప్రారంభం



సీహెచ్‌పీలో ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం సింగరేణిలో రక్షణ పక్షోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఉద్యోగులు, అధికారులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో రక్షణకు మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణ కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి మాత్రమే కంపెనీకి శ్రేయస్కరమని తెలిపారు. ప్రతీ ఉద్యోగి రక్షణ నియమాలు పాటిస్తూ, రక్షణ పరికరాలు ధరించి పని చేయాలన్నారు. రక్షణ తనిఖీ కమిటీ సభ్యులు సీహెచ్‌పీలో రక్షణ ఏర్పాట్లు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ కమిటీ కన్వీనర్ జీఎం(ఈఅండ్ఎం) ఎలిషా, ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, రక్షణ అధికారి శ్రీధర్‌రావు, ఇన్‌చార్జీ సీహెచ్‌పీ డీజీఎం చంద్రలింగం, కమిటీ సభ్యులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్(జి): భర్త వేధింపులు తాళలేక చెరువులో దూకి మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మండల కేంద్రానికి చెందిన పందిరి మమత, సాయన్న భార్యాభర్తలు. భర్త పెడుతున్న వేధింపులతో మనస్తాపానికి గురైన మమత సోమవారం స్థానిక బసం చెరువులో దూకింది. గమనించిన స్థానికులు పోలీస్ కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణకు సమాచారం అందించగా స్థానికుల సాయంతో మహిళను బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అందించి 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహిళ సోదరుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్‌కు చెందిన పొచ్చన్న ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు పంట చేనుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దాదాపు 20 క్వింటాళ్ల పత్తి నిల్వ ఉండగా, గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే సగం వరకు పత్తి కాలిబూడిదైంది. దీంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

తండ్రిని చంపిన తనయుడు



ముత్యం మృతదేహం

నిర్మల్‌రూరల్: తనయుడి చేతిలో తండ్రి హతమైన సంఘటన మండలంలోని ముఠాపూర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముఠాపూర్‌కు చెందిన గుర్రం ముత్యం (47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి బంధువుల ఇంట్లో జరిగిన విందుకు హాజరై ఇంటికి వచ్చాడు. తన తల్లి వెంకటమ్మను డబ్బులు ఇవ్వమని కొట్టాడు. గమనించిన అతని పెద్ద కుమారుడు మణిదీప్ నానమ్మను ఎందుకు కొడుతున్నావ్ అంటూ చీరతో గొంతు నులిమి హత్య చేశాడు. గాయపడిన వెంకటమ్మను అదేరాత్రి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి తనతండ్రి గుండెనొప్పితో మృతి చెందాడని గ్రామస్తులను నమ్మించాడు. అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లింబాద్రి తమదైన శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000795]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253941]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ఆశలు.. అడియాశలు

- మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు
- తడిసిన ధాన్యం, నేలరాలిన పత్తి
- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు

మంచిర్యాల జిల్లాలో వర్షపాతం వివరాలు

ప్రాంతం	కురిసిన వర్షం (మి.మీలలో)
కన్నెపల్లి	26.7
నెన్నెల	21.1
భీమిని	18.6
జన్నారం	10.5
వేమనపల్లి	10.6



నెన్నెల: ధాన్యం కుప్పల మధ్యలో నుంచి పారుతున్న వరద నీరు



నెన్నెలలో దూదిపింజ నుంచి నేలరాలుతున్న పత్తి



వర్షానికి తెగిన తాత్కాలిక వంతెన



నెన్నెలలో మొలకెత్తిన వరి ధాన్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంచిర్యాల జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటచేలలో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి వర్షానికి నేలరాలి మట్టిలో కలిసిపోతోంది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరిధాన్యం కళ్లముందే తడిసి ముద్దవుతుంటే రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మరో పదిహేను రోజులు వాతావరణం సహకరిస్తే దిగుబడి వచ్చిన పంట అమ్ముకుని అప్పులన్నీ తీరుద్దామనుకున్న సమయంలో ఆకాల వర్షాలు ఆగం చేస్తున్నాయి. ఉదయం ఎండ కాస్తున్నా సాయంత్రం కాగానే ఏదో ఒకచోట మబ్బులు కమ్ముకుని తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు జిల్లాలో 5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ధాన్యం కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

తెగిన ఎర్రవాగు వంతెన

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరి, పత్తి పంటలు తడిసి ముద్దయ్యాయి. చేతికి అందివచ్చిన పంట తడిసి పోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. చిన్నతిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఎర్రవాగు తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

ధాన్యం వరద పాలు



కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఏడుస్తూ కుప్ప చేస్తున్న రైతు గోగు రాజేశ్

జన్నారం: అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర జేసింది. జన్నారం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గోగు రాజేశ్ తనకున్న ఎకరం పొలంలో వరి పంట వేయగా దిగుబడి వచ్చిన ధాన్యం పొనకల్ మార్కెట్ యార్డులో పోశాడు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీరు కుప్పలోంచి పోవడంతో ధాన్యం కొట్టుకుపోయింది. సోమవారం మార్కెట్ యార్డుకు వెళ్లిన సదరు రైతు రోదిస్తూ అక్కడున్న ధాన్యాన్ని కుప్పచేస్తుండడం తోటి రైతుల హృదయాలను కలిచివేసింది.

చెడగొట్టు వానలు



రెండెకరాల్లో వరి పంటను కోసి కల్లంలో ధాన్యం ఆరబోశా. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం చుట్టూ వరద నీరు నిలిచింది. రాత్రికి రాత్రి కాల్వలు తీసి వరద నీళ్ల బయటకు పంపించా. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పదెకరాల్లో పత్తి నేలరాలి పోయింది. చెడగొట్టు వానలు పడాల్సిన సమయంలో పడలేదు.

– గంగిశెట్టి ఆశన్న, నెన్నెల

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు..



నాకున్న రెండెకరాలతో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి చేతికందిన పత్తి పంట చెట్టునుంచి నేల రాలి మట్టిలో కలిసిపోతోంది. ఎకరానికి ఏడెనిమిది క్వింటాళ్లు దిగుబడి వచ్చేది. ఇప్పుడు మూడు క్వింటాళ్లు కూడా వచ్చేలా లేదు. పెట్టుబడి కూడా వచ్చేట్లు లేదు.

– కొండు బక్కయ్య, నెన్నెల

మంచిర్యాలలోనే స్పీడ్ పోస్ట్ సేవలు



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎంఎస్ కార్యాలయం

- ఆర్‌ఎంఎస్ కార్యాలయం జిల్లా కేంద్రంలోనే కొనసాగేలా ఉత్తర్వులు

సాక్షి ఎఫెక్ట్..

పాతమంచిర్యాల: స్పీడ్‌పోస్ట్ సేవలు, ఉత్తరాల బట్వాడా ఇకనుంచి మంచిర్యాల నుంచే జరుగనున్నాయి. డిసెంబర్ నెలాఖరు నుంచి ఉత్తరాలు, పార్శిళ్లు త్వరగా గమ్యస్థానాలకు చేరే అవకాశం ఉంది. 2016 వరకు జిల్లా కేంద్రంలోనే కొనసాగిన స్పీడ్ పోస్టాఫీస్ (ఇంట్రా సర్కిల్ హబ్)ను అధికారులు వరంగల్‌కు తరలించారు. దీంతో ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో ఒక్కరోజులోనే అందాల్సిన ఉత్తరాలు మూడు నుంచి నాలుగు రోజులు ఆలస్యంగా అందేవి. కొన్నిసార్లు పోస్టల్ బ్యాలెట్లు కూడా లెక్కింపు సమయానికి కేంద్రాలకు అందని సంఘటనలు ఉన్నాయి. తాజాగా జిల్లాలో ఆర్‌ఎంఎస్ సేవలను కూడా ఇక్కడి నుంచి వరంగల్‌కు తరలించాలని తపాలాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విషయాన్ని ముందే గ్రహించిన 'సాక్షి' నవంబర్ 08న 'డిస్ట్రిబ్యూషన్ తరలింపు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రజాప్రతినిధులు స్పందించారు. తపాలాశాఖ ఉన్నతాధికారులు సైతం జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపి కార్యాలయం తరలింపుపై అభిప్రాయాలు సేకరించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తపాలాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంతేకాకుండా ఆర్‌ఎంఎస్ కార్యాలయం, స్పీడ్ పోస్టాఫీస్‌ను జిల్లా కేంద్రంలో కొనసాగించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ నవంబర్ 23న కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు విన్నవించారు. దీనిపై తపాలాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేశారు. రెండు కార్యాలయాలు ఇక్కడి నుంచే కొనసాగించాలని డిసెంబర్ 5న కేంద్ర కమ్యూనికేషన్‌ల మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (మెయిల్ ఆపరేషన్స్) హరిఓం శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షి కథనంతోనే ఆర్‌ఎంఎస్ కార్యాలయం జిల్లా నుంచి తరలిపోకుండా నిలిచిందని ఈ సందర్భంగా ఉద్యోగులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులకు నివేదించాం



మంచిర్యాల నుంచి ఆర్‌ఎంఎస్ కార్యాలయాన్ని తరలించవద్దని ఉన్నతాధికారులకు పలుమార్లు నివేదికలు పంపించాం. ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లాలోని సూపరింటెండెంట్‌ల అభిప్రాయాలు అడిగారు. కార్యాలయం తరలింపు వలన ఉత్తరాల బట్వాడ ఆలస్యమౌతుందని తెలిపాం. యూనియన్ నాయకుల అభ్యర్థనను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

– ఆర్.రామారావు, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, మంచిర్యాల

ఇక్కడే కొనసాగించేలా చర్యలు



మంచిర్యాల జిల్లాలోని కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని, ఇక్కడే కొనసాగేలా చూడాలని తపాలాశాఖ, కమ్యూనికేషన్ల శాఖ అధికారులకు విన్నవించాం. వారు సానుకూలంగా స్పందించారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులను సైతం దృష్టిలో ఉంచుకుని కార్యాలయం ఇక్కడే కొనసాగించేలా చర్యలు చేపట్టాం.

– గడ్డం వంశీకృష్ణ, ఎంపీ, పెద్దపల్లి

ఉద్యోగం రెగ్యులర్ కాలేదని ఆత్మహత్య..

- 510 జీవోతో అన్యాయం జరిగిందని ఆవేదన..
- తన చావుతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలని సూసైడ్ నోట్



భరత్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఆరేళ్లుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. తనకన్నా జూనియర్లు రెగ్యులర్ అయ్యారని, తనకు మాత్రం అన్యాయం జరిగిందని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో సోమవారం సాయంత్రం జరిగింది. జిల్లా కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగి వకులాభరణం భరత్‌కుమార్ (37) ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు భరత్ రాసిన ఓ సూసైడ్ లేఖ అందరినీ కంటతడి పెట్టిస్తోంది.'మా అమ్మానాన్నల కడుపులో పుట్టడం నా అదృష్టం. ఎంతో పెద్ద ఉద్యోగం వస్తుందని కలలు కన్నాను. 2018 లో ఆరోగ్యశాఖలో ఆర్‌ఎన్టీసీపీ విభాగంలో సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం పొందాను. జీవితంలో స్థిరపడతానని ఆశించాను. కానీ నాకన్నా హోదా తక్కువ ఉన్న వారికి ఇదే శాఖలో జీతం ఎక్కువగా రావడం.. నా జీతం మాత్రం పెరగకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండిపోవడంతో తీవ్రంగా నిరాశ చెందాను. నాతోపాటు నాలాంటి వాళ్లను రెగ్యులర్ చేసే విషయంలో జీవో 510 అన్యాయం చేసింది. అప్పటి ప్రభుత్వంలో వచ్చిన ఈ జీవో వల్ల నష్టపోయాం. ఇటీవల జీవో 16 కూడా అమలు చేయవద్దని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో మాకు తీరని అన్యాయం జరిగింది. ఉద్యోగం రెగ్యులర్ అవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూశా. కానీ అది జరగక పోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యా. నా భార్య పల్లవికి అన్యాయం చేస్తున్నా. కుమారుడు దేవాను వీడిపోతున్నా. మీ ఇద్దరినీ బాగా చూసుకుంటానని కలలు కన్నా. కానీ ఉద్యోగం రెగ్యులర్ కాకపోవడంతో మీకు చెప్పినట్లుగా ముందుకు వెళ్లలేకపోయా. ఇంతకాలం పనిచేసిన కాలంలో నాకు రావాల్సిన పీఆర్‌ఎల్ బకాయిలు నా భార్యకు ఇవ్వండి. నా ఆత్మహత్యతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలి. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయిలో తెలిసేలా చూడండి. సహచర ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందరికీ రుణపడి ఉంటా. అమ్మా నాన్న సారీ..' అంటూ సూసైడ్ నోట్ రాశాడు. భరత్ మృతి ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎరోడ్రమ్ సమీపంలో సోమవారం గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దారులొద్దికి చెందిన గేడం సురేష్, సిడాం సురేష్, బేల మండలంలోని గర్కగూడెంకు చెందిన మేస్రం శ్రీహరి 3.800 కిలోల గంజాయిని పట్టణంలో విక్రయించేందుకు బైక్‌పై వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు కాపు కాసి వారిని పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో వన్‌టౌన్ ఎస్సైలు అశోక్, ఇసాక్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి చూపిస్తున్న సీఐ

హత్యాయత్నం కేసులో ముగ్గురు..

బెల్లంపల్లి: బెల్లంపల్లి కోల్ కెమికల్ ఏరియా ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ యువకుడిపై హత్యాహత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ డబ్బుల విషయంలో ఆశా సంతోష్‌కుమార్‌పై గొర్ల అఖిల్, కామెర రాజు, గడ్డం మదన్‌కుమార్ కత్తి, బీరు సీసాలతో పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. సంతోష్‌కుమార్ తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై రంగు తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ

- ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభలో ఆదివాసీ పెద్దలు

హక్కుల సాధనకు పోరాడుదాం



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు సమన్వయంతో పోరాడుదామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర నాయకులు, ఆదివాసీ పెద్దలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీల న్యాయమైన హక్కులు, సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించని పక్షంలో ఏప్రిల్ 10 తర్వాత ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచే మరో ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. చట్టబద్ధత లేని లంబాడీల ఎస్టీ హోదా రద్దు చేయాలని, జైనూర్ మండల కేంద్రంలో 1970 తరువాత వలస వచ్చిన మైనార్టీలను వెంటనే తరలించాలని, ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచ్చయ్య, రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, కోశాధికారి కొట్నాక్ బారిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న అండర్–14 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కోదాటి ప్రదీప్, కోచ్. ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని క్రికెట్ నెట్‌లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. 1 సెప్టెంబర్ 2010 తర్వాత పుట్టినవారు పోటీలకు అర్హులని, మరిన్ని వివరాలకు 9440010696 నంబరులో సంప్రదించాలని సూచించారు.

హత్య కేసులో నిందితుని అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ నెల 8న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మేదరివాడకు చెందిన మిట్టపల్లి వీరాస్వామి కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన తీగల భాగ్యతో మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఈ నెల 8న మద్యం మత్తులో భాగ్యతో గొడవపడి బండరాయితో తలమీద బాదడంతో మృతి చెందింది. మృతురాలి సోదరి సంపతి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గాదిగూడ మండలం శివన్నూరా గ్రామానికి చెందిన రాజు అంగన్‌వాడీ సెంటర్, సీసీరోడ్డు మంజూరు చేయించాలని, బేల మండలం గణేశ్‌పూర్ గ్రామానికి చెందిన మడావి లస్మా ఎడ్ల జత ఇప్పించాలని, సిర్పూర్(యూ) మండలం మెట్టిగూడకు చెందిన పెందూర్ భువనేశ్వర్ ఇందిరమ్మ ఇల్లు, భీమిని మండలం కర్జిభీంపూర్ గ్రామానికి చెందిన టేకం పోషన్న బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

నేరడిగొండ: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ఆరుగురు కాంస్య పతకాలు సాధించినట్లు ప్రత్యేక అధికారి రజిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ఆర్.శ్రీలేఖ డి.శిరీష జె.అనిత, టి.శిరీష, ఎం.శ్రీనిత్య బి.వనితను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ స్నేహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు సింధుజ, అంజలి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రోజారాణి తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న 71వ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు.